

# రాధా మాధవీయం

పాణ్యం సుబ్రహ్మణ్యం

రాధను చూడాలనిపించింది. సరాసరి గూడూరు బస్టాండులో రాపూరుకుపోయే బస్సెక్కేశాను. రాధను చిన్నప్పుడోసారి చూశాను. తరువాత కుటుంబ కలహాలవల్ల రాపూరుకు పోలేదు. ఇన్నాళ్ళకు మళ్ళీ మా కుటుంబ పరిస్థితులు చక్కబడ్డాయి. రాధ కిప్పుడు పదహారేళ్ళుండవచ్చు. ఇలా ఆలోచిస్తున్న నేను బస్సు కదలడంతో కిటికీ చువ్వలనుండి బయటికి చూశాను. చల్లని గాలి ముఖానికి తగిలి హాయనిపించింది. రోడ్డు కిరువైపులా కాపుకొచ్చిన వరి పొలాలు, దూరంగా వంపులు తిరుగుతూ ప్రవహిస్తున్న వాగులూ కనిపించాయి. బస్సు అరవై మైళ్ళ వేగంతో పోతూవుంది ఎన్నో కరెంటు స్తంభాలు వెనక్కి వెళ్ళిపోతున్నాయి. మనిషి జీవితయానంలో స్తంభాలు క్షణాలాంటివి. వెనక్కి వెళ్ళిన స్తంభాలు ముందుకురానట్లే గడచిన క్షణాలు తిరిగి రావు టెలిఫోను తీగలమీద పాలపిట్టలూ, కొంగలూ, జెముడు కాకులూ ఆటలాడుకుంటున్నాయి. వీటన్నిటినీ చూస్తూ మరో లోకంలో విహరిస్తున్నాను. ఇంతలో ఇంతలేసి కళ్ళున్న పదహారేళ్ళ అమ్మాయి చటుక్కున నా ప్రక్కన వచ్చి కూర్చుంది నేను ఒక్క క్షణం నివ్వెరపోయాను నేను హైదరాబాదులో చదువుకొనేటప్పుడు ఇలా అమ్మాయిలు వచ్చి కూర్చోడం మామూలే అయినా, ఇప్పటికి మటుకు నాకు చాలా ఆశ్చర్యమేసింది ఆ అమ్మాయి నాకు దగ్గరగా జరుగుతోంది.

'ఇదేమిట్రోయ్ దేవుడా! సిగ్గూ ఎగ్గూ లేకుండా నా మీది మీది కొచ్చేస్తుందనుకొని కిటికీకి దగ్గరగా జరిగాను బిడియమూ, భయమూ ఆవరించాయి. క్షణం గడిచింది. ఆపిల్ల నాకు మరింత దగ్గరగా జరిగేసి ఏమీ ఎరగనట్టు పత్రికతీసి చదవడం ప్రారంభించింది.

ఎంత మహిళా సంవత్సరం పొడిగించాలని స్త్రీలోకం ఘోషిస్తే మాత్రం, పరాయిపిల్లయింత స్వేచ్ఛగా, ఇంత పబ్లిగ్గా మగాడు ఏమనుకుంటాడో నన్న జంకుకూడా లేకుండా (ఈ కాలం పిల్లలు ఏమీ అనుకోరనుకోండి) బస్సులో అంతమందీ చూస్తుండగానే నన్ను రాచుకొని కూర్చోడమే! అదేమంటే మీ మనసులు ఎదగలేదు మీరు అనాగరికులు, స్త్రీ స్వతంత్రిస్తే చూసి ఓర్చుకోలేరు'' అని మగలోకం పై విరుచుకుపడలారు.

నాకు కోపం ముంచుకొచ్చేసింది.

''ఏమండీ, ఏమిటిలా ...'' ఆ పైనా నా నోట మాట పెగల్లేదు.

'ఏ సిగ్గులేనిపోతేసరి' అనుకొని మరింత కిటికీ దగ్గరికి జరిగి దినపత్రికలో ముఖం దూర్చేశాను.

''అరెరే! ఈరోజు పత్రికేనా ఇది?'' అని చెప్పాపెట్టకుండా గబుక్కున చేతిలోని పత్రికను లాగేసుకొని ఏదో కొంపలు మునిగిపోతున్నట్టు పేజీలు త్రిప్పడం మొదలు పెట్టింది కళ్ళింతవి చేసుకొని.

చెప్పొద్దూ నాకు ఒళ్ళు మండిపోయింది

''ఏమిటిది చెప్పాపెట్టకుండా పేపరు లాగేసుకోవడమే'' కాస్త చిరాగ్గా అన్నాను

(మాటలు పెగలినందుకు లోలోపల చాలా సంతోషపడ్డాననుకోండి.)

'ఏం తీసుకొంటే ?' ఎదురు పశ్న వేసింది మీనాక్షి. (కొంపదీసి ఆమె పేరను కొనేరు సుమా, కళ్ళను దృష్టిలో పెట్టుకొని ఇలా అన్నాను.)

"మెత్తగావుంటే మొత్తబుద్ధి అవుతుం దని ఏవిటండీ మెత్తగా వున్నాననేనా ?" కాస్త రోషంగా అన్నాను.

'ఓయబ్బో! పెద్ద! నేను మిమ్మల్ని గట్టివాడనుకున్నాను కాబోలు ...' మూతి మూడువంకర్లు తిప్పింది మీనాక్షి.

"అంటే ఏవిటి మీ ఉద్దేశ్యం ?"సూటిగా చూస్తూ అన్నాను.

'నాకే వుద్దేశ్యమూ లేదు' స్టైల్‌గా అని "అమ్మయ్యో! బఠాణీల వాడొచ్చినట్లున్నాడు. మీ జేబులో చిల్లరెంత వుంది. పాపం! వాడికి బోణీ అయినట్టు కూడా లేదు" బుంగ మూతి పెట్టి అంది.

"ఇదిగో మీనాక్షిగారూ! హాస్యానికి కూడా హద్దుండాలి"

"ఇదిగో విశ్వామిత్రుడుగారూ"

"నాపేరు మాధవ్ మైండిట్"

'నా పేరు రాధ నోటిట్.'

'మీనాక్షిగారూ...సారీ...ఐమీన్ రాధగారూ మిమ్మల్నొకటడుగుతాను చెబుతారూ ?'

"సరే ఇంత ఇదిగా అడుగుతున్నప్పుడు కాదంటానా ? ఓకే, యూకెన్ ప్రొసీడ్."

"మీరు విశాఖపట్నంనుంచి రావడంలేదు కదా ?" ముసిముసిగా నవ్వుతూ అడిగాను.

"యూ ఆర్ రాంగ్ మిస్టర్ మాధవ్. నేను ప్రస్తుతం విక్రమసింహపురం, ఐమీన్... నెల్లూరునుండి వస్తున్నాను." అంది తీవిని వెలగబెడుతూ "మీరు పొరబడుతున్నారు రాధ గారూ, మీరు విశాఖపట్నంనుంచే వచ్చుం టారు. కాస్త జ్ఞాపకం తెచ్చుకోండి" ఎత్తి పొడుస్తూ అన్నాను.

'కాదు మహానుభావా నెల్లూరునుంచే' అంది కోపాన్నభినయిస్తూ.

"మరి మీరు నాతో ఇంత చనువు తీసు కోవడానికి మీకు..."

'సిగ్గేయడంలేదూ ? అంటారా' అంది నవ్వుతూ. అలా రాధ నవ్వుతున్నపుడు సొట్టలు పడ్డ ఆమె బుగ్గలు ఎంత అందంగానో వున్నాయి. సారీ ఆమే అందంగావుంది. కాని అలా కళ్లార్పకుండా చూడ్డంవలన ఆడవాళ్ళు మరింత బిగుసుకుంటారని ఐమీన్ పట్టు పగ్గాలుండవని చూపులు మరల్చుకొని పైకి మాత్రం.

"పైగా నవ్వొకటే తక్కువ. అనుమా నమేంలేదు. విశాఖపట్నం పిచ్చాసుపత్రినుంచే ఈవిడగారి రాక" అని కాస్త మెల్లగా అని.

'కండెక్టర్' అని కాస్త గట్టిగా పిలిచాను.

"ఏవిటిసార్ ?" అన్నాడు కండెక్టర్.

"ఇందాకట్నుంచి ఈ అమ్మాయి..."

"నీళ్ళు కావాలంటోంది. ఇక్కడెక్కడైన దొరుకుతాయా ?" మాటనందుకొంది రాధ ఆమె నెరజాణతనానికి స్థాణువునైపోయాను చుర చుర చూశాను.

ఆమె నవ్వుతూ చూచింది.

"నాదగ్గర వాటర్ బ్యాగుందమ్మా. ఇస్తా నుండండి" అని వాటర్‌బ్యాగ్ తెచ్చిచ్చాడు కండెక్టరు.

పొగరుబోతు పిల్ల నీళ్ళు తాగేసి..."మీరు తాగుతారా ?" అంది ఒయ్యారంగా.

కోపంగా ముఖం తిప్పుకొని కిటికీలోంచి కదలుతున్న చెట్లను చూడసాగాను.

కండక్టరు ఇది గమనించి, 'అయ్యగారికి కోపమొచ్చినట్లుందమ్మా...' అన్నాడు.

'ఆయనకు అప్పుడప్పుడూ అంతే' అంది రాధ "మీ ఆయనకే కాదమ్మా... మా మగ జాతే అంత" అన్నాడు వాడు పళ్ళికిలిస్తూ వాడి అధిక ప్రసంగానికి పళ్ళు రాలగొట్టాలని పించింది. పైగా వాడు నన్ను అయ్యగార నడమూ, ఈ మీనాక్షి 'ఆయనకు అప్పు డప్పుడూ అంతే అనడమూ' నాకు ఒళ్ళు మండిపోయింది.

ఇదేం ఖర్మరా బాబూ అనుకొని.

"ఇదిగో అమ్మాయ్, ఇందాకట్నుంచీ చూస్తున్నాను. ఏవిటిలా పెళ్ళాంలా పరాచి కాలాడుతావ్." అన్నాను కాస్త సీరియస్‌గా.

'పెళ్ళాం కాబట్టే' అంది సింపుల్‌గా.

'శివ శివా' వెనకటికి గర్భవతి అయిన ఒక మ్మాయ్ మా ఫ్రెండు ఇంటికెళ్ళి మీ అబ్బాయి నన్నాన్యాయం చేశాడని ఫిర్యాదు చేసిందట. అలాగంటే కట్నానికి కట్నమూ, పాపానికి పాపమూ పోతాయని పాపం' అన్నా డో మిత్రుడు. అలాగే ఎంత ధైర్యం అనుకొని ఏవిటి మీరు నా పెళ్ళామా ? ఆముదం తాగిన ముఖంపెట్టి అన్నాను.

'వుడ్, బి సర్టెన్లీ !' అంది రాధ.




పసి బిడ్డకు జీర్ణసంబంధమైన బాధలు కలిగినప్పుడు...



సౌమ్యంగా పనిచేసే

అమృతాంజన్ గ్రైప్ మిక్స్చర్

బాధను అతి త్వరగా తగ్గిస్తుంది

OBM 3410/4 TG




కడుపునొప్పి, అజీర్ణము, వాయువు, పళ్ళు వచ్చేటప్పుడు కలిగేబాధలు మొదలైన వాటిలో దేనితోనైనా సరే, మీ పసిబిడ్డ బాధ పడుతూంటె అమృతాంజన్ గ్రైప్ మిక్స్చర్‌తో అతి త్వరగా ఉపశమనం కల్గించండి త్వరగా సులభంగా తిరిగి మీ పసిబిడ్డ ఆనందంగా నవ్వుతుంది.

గృహౌషధములు తయారుచేయుటలో తరతరాలుగా నమ్మకకు పాత్రమైన అమృతాంజన్‌వారి తయారీ.

అమృతాంజన్ లిమిటెడ్

**40సం॥ అనుభవం**
వరిబీజము బుడ్డలు బీజకుట్లు
మొదలగు వ్యాధులకు ఆపరేషన్
లేకుండా గ్యారంటీగా బాగుచేయబడును
వివరములకు
రె అండ్ కో రిజిస్టర్డు ఆసుపత్రి
గౌలిగూడ నయ బస్ డిపో ఎదుట,
బాలాజీలాడ్జింగ్ ప్రక్కన, హైద్రాబాద్-12.
ఆఫీస్‌ఫోన్ 42870, ఇంటిఫోన్:38544

**మూలశంకకు**
త్వరగా
నమ్మకమైన
**హెడన్‌సా**
విరేపనముతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!

**అజీర్ణం
వల్ల మీరు
భయపడుతున్నారా?**
**హ్యూలెట్స్
మిక్స్చర్
తీసుకొని -
తిరిగి తినడం
ప్రారంభించండి**



సి జె హ్యూలెట్ & సన్
(ఇండియా) ప్రైవేట్
లిమిటెడ్
మద్రాసు 600 002,
కలకత్తా 700 001
SAA/CJH/1191

# రాధా మాధవీయం

'ఏవిటీ వేళాకోళం' అన్నానూ అయోమయంగా.

''ఇదిగో అబ్బాయ్ ఇందాకట్నుంచి చూస్తున్నాను ఎందుకలా దూర్వాస మహర్షిలా ఎగిరెగిరి పడతావ్ ?'' అంది హేళనగా.

''ఛి, ఛీ ఎంత అందగత్తె అయితేమాత్రం ఇంత తెగింపా ? డర్టీకేచర్''అనుకొని సూట్ కేస్ తీసుకొని అక్కడనుండి లేవాలని ప్రయత్నిస్తూ, చేయి సూట్‌కేస్ మీద వేశాను. ఇంతలో ఆ అమ్మాయి చేయి నా చేతిని పట్టుకొంది. గుండె ఝల్లుమంది. (మధురానుభూతి) నన్ను నేను నిలదొక్కుకొని రాధ కళ్లల్లోకి చూశాను ప్రశ్నార్థకంగా'

''రచయితగారూ! దయచేసి కూర్చుంటారా?'' అంది కళ్లతో నవ్వుతూ.

నాకాశ్చర్యం వేసింది. నేను రచయితనని ఈవిడకెలా తెలుసు. ఆలోచనలో మునిగిపోయాను. కొంచేపట్లో నా ఆశ్చర్యం మటుమాయమైపోయింది. ఈ మధ్యే ప్రముఖ పత్రిక నా ఫోటోవేసి పాఠకులకు పరిచయం చేసింది. నేను కూర్చుంటూ నాలో నేను నవ్వుకున్నాను, బహుశా ఈమె నా అభిమాని అయ్యుండొచ్చని.

''అబ్బ! ఎక్కడో ఇల్లు కాలిపోయుంటాయ్''

''ఎంతసేపటికి చిరునవ్వు ఈ ముఖారవిందంలో విరియుట'' ఓరగాచూస్తూ అంది రాధ.

''మీరు నా రచనల్ని అభిమానిస్తారన్నమాట!!'' అన్నాను పెద్ద 'సైకాలజిస్ట్'లా.

''మీ రచనల్నా'' ... ఆముదం తాగిన ముఖం పెట్టిందా రాధ.

''ఏం?'' అన్నాన్నేను నిరాశగా.

పెదవుల్ని దాటకుండా నవ్వింది రాధ.

''అవునూ రాజేశ్వరి బాగుందా ?'' అంది నన్ను మరోదారి పట్టిస్తూ.

''ఏ రాజేశ్వరి? మా చెల్లాయేనా? ఓహో ఇదన్నమాట సంగతి. మా రాజేశ్వరికి నీవు స్నేహితురాలివన్నమాట. రాజీ నా ఫోటో నీకు చూపించి వుంటుంది. ఇక్కడ గుర్తు పట్టి నా ప్రాణాలు తీస్తున్నావ్.'' విసురుగా అన్నాను.

''తెలివికి సంతోషించాముగాని రాధ ఆ వూరులో లేదు తెలుసా ?'' అంది.

'ఇక్కడే వున్నావుగా' అదోలా చూస్తూ అన్నాను.

''నేనుకాదు బాబూ! మీ గారాల మరదలుపిల్ల. ఐమీన్ మీ అత్తకూతురు.''

'ఏంటీ రాధ ఎక్కడకెళ్ళింది?' ఆత్రంగా అడిగాను.

'ఎందుకో అంత ఆతృత?' బుంగమూతి పెట్టి అంది రాధ.

'నిన్ను తప్పించుక బయటపడదామని.'

''కాదు కాదు అత్తకూతురు కాబట్టి'' నవ్వింది రాధ అనే మీనాక్షి.

''పోనీ రాధ అత్తకూతురన్న విషయం జ్ఞాపకముందన్నమాట.''

''అది సరేగాని రాధను గూర్చి మీకు బాగా తెలుసునన్నమాట''

''ఇప్పటికి దొరికివచ్చారన్నమాట. ఏమిటీ రాధను గూర్చేకదా మీరు అడుగుత?''

''ఓ బా...గా... తెలుసు'' దీర్ఘంతీసింది మీనాక్షి అనేరాధ.

''అయితే రాధ ఎక్కడికెళ్ళిందో చెబుతారా!'' కాస్త దగ్గరగా జరుగుతూ అన్నాను.

''దూరం... దూరం ... ఎందుకో అంత ఇన్ట్రస్ట్... ఏం మీకు తెలీదా ?'' కళ్లు త్రిప్పుతూ అంది రాద.

''సరేలే, తెలిస్తే మిమ్మల్నెందుకూ అడగడం ?''

''రాధను చూసి ఎన్నాళ్ళయిందేమిటి?'

'సరిగ్గా పది సంవత్సరాలు'.

''అమ్మ బాబోయ్... అన్ని సంవత్సరాలు ఎందుకు చూడలేదో ?''

'దానికి కారణాలున్నాయి.'

'అవి చెప్పకపోతే రాధ విషయం కట్.'

''అబ్బే మరేమీలేదు... ఏవో... కుటుంబ కలహాలవల్ల...''

'అంతేనా మరింకేమైనా ?'

'అబ్బే మరేంలేదు'

''ఇన్నాళ్లకి రాధ జ్ఞాపకమొచ్చిందన్నమాట''

''చెప్పానుకదా దానికి కారణముందని''

''పోనీ రాధ విషయం చెప్పేస్తాను. ఇనుకోపురి, రాధ నెల్లూరు వి. ఆర్. కాలేజీలో చదువుతోంది.''

''ఆఁ నిజమా...''అన్నాన్నేను.

''అబద్దం చెప్పాల్సిన అవసరం నాకేమిటి? అవునూ ఇంతకూ మీరు రాధకేమౌతారు ?''

నేను ... నేను..."

"అలా నీళ్ళు నములుతారెందుకు?"

"నేను రాధకు బావ నౌతాను"

"బాప్‌రే! మీరు రాధకు బావ అవుతారా?"

'ఏం కాకూడదా ?'

"అబ్బే తన బావ సిగ్గుపడతాడని, కోపం ముక్కుమీదుంటుందని మారాధ నా కెప్పుడూ చెప్పలేదు అందుకని," అంది నవ్వుడికిస్తూ.

"అవునూ రాద ఎలా వు ం టు ం ది?" కుతూహలంతో అడిగాను.

"నాలా వుంటుంది" కళ్ళెగరేస్తూ అంది.

'మీలాగా' అన్నాను డీలాపడిపోతూ.

(మీనాక్షి ఉరఫ్ రాధ చాలా అందంగా ఉంటుంది. 'నాలా మీ రాధ' వుంటుందని ఆమె అన్నప్పుడు నా లాంటి అదృష్టవంతుడీ భూమీమ్మీద ఉండడని సంబరపడ్డం, ఆ సంబరాన్ని పైకి కనిపించనీయకూడదని, మీనాక్షిని ఏడ్పించాలనీ అలా అన్నాను )

"ఏం నేను బాగాలేనా?" స్త్రీ సహజమైన ఉడుకుమోత్తనంతో అంది.

'అబ్బే బాగాలేవని అన్నానా ?' తప్పించుకోవాలని మెల్లగా అన్నాను.

## రాధా మాధవీయం

"పోనీ మీ అబ్బాయిల డ్రీమ్‌గరల్ హేమ్మాలినీ లాగుండాలా"

"అబ్బే మీరు హేమ్మాలినీకంటే బాగుంటారు కాస్త ఏడిపిద్దామని అలా అన్నానంతే" అని అన్నాను.

"నిజంగా అంటున్నారా?" ముఖంలో వేయి కిలోవాట్ల విద్యుత్ వెలిగినట్లయింది.

"ఏం నా మాట మీద నమ్మకంలేదా?"

"నిజంగా అంత అందంగా ఉన్నానా ?" మగాడు ఆడదాన్ని అందంగావున్నావని అంటే చాలు. ఇక కనీసం వందసార్లన్నా తన అందాన్ని గూర్చి చెప్పించుకొని స్త్రీ తృప్తి పడుతుందని మా మిత్రుడు, స్త్రీ మనోశాస్త్రవేత్త, శ్రీధర్ అన్నది ఈ క్షణంలో నిజమనిపించింది నాకు.

"అవును. నువ్వు చాలా అందంగా వున్నావు"

'చాలా సంతోషం...ఇంకో విషయం'

(స్త్రీ సంతోషించిందంటే మనం మాటర్ రాబట్టుకొన్నామన్నమాటే మరి)

"ఏమిటది" అన్నాన్నేను ఆత్రంగా.

"రాధ ఈ రోజు నెల్లూరు నుంచి రాపూరుకు వచ్చేస్తుంది" గాలికి కదలాడుతున్న ముంగురుల్ని సవరించుకొంట్టూ అంది మీనాక్షి ఉరఫ్ రాధ.

'నిజంగానా?' ఆశగా అడిగాను.

'అబ్బబ్బ మళ్ళీ అదేమాట! ఇంటర్ ఎగ్జామ్స్ రాసేసింది. మరి అక్కడేం పని? అందుకని చక్కా వచ్చేస్తుంది.'

'అని మీతో చెప్పిందా?'

"ఆ . అవును" అంది దరహాసిస్తూ.

"చాలా థాంక్సు ఐ మీన్ కృతజ్ఞతలు."

"ఎందుకు?"

"ఇన్‌ఫర్మేషన్ ఇచ్చినందుకు"

'నో మెన్షన్'

'అరె, మాటల్లో రాపూరు వచ్చేసిందే'

'మీ ఇల్లెక్కడ' అంది.

"కొత్తపేటలో" అన్నాను సూట్‌కేసుతో దిగుతూ.

"టాటా! వెళ్ళొస్తాను. మళ్ళీ కలుసుకొందాం" అంది మీనాక్షి.

"బతికించావ్ తల్లీ! నీకు రాధ అని



పేరెవరు పెట్టారోగాని జెలగ. వసపిట్ట, ఆదిగాగల పేర్లలో ఏదో ఒకటి పెట్టాల్సింది అని నాలో నేననకొని "అలాగే, అలాగే తప్పక, కలుసుకోండాం" అన్నాను బలవం తంగా నవ్వును పెదవులపైకి తెచ్చుకొంటూ

* * *

"ఏమిటయ్యా ఇదేనా రావడం" అంది అత్తయ్య ఎదురువస్తూ.

"అవునత్తయ్యా" చిరునవ్వుతో జవా బిచ్చాను.

'ఒరేయ్ గోపీ! బావొచ్చాడు' ఇంట్లోవున్న గోపీని పిలిచింది అత్తయ్య.

గోపీ పరిగెత్తు కొంటూ వచ్చి; 'బావ ఇప్పుడేనా రావడం ఉత్తరం ముక్కకూడా వ్రాయకుండా అగస్మాత్తుగా ఊడిపడ్డావన్న మాట' అన్నాడు నవ్వుతూ.

"బలేవాడివే ఉత్తరం ముక్కరాస్తే మీకందరికి తెలిసిపోదూ ?" అన్నాన్నేను.

అత్తయ్య, గోపీ, గట్టిగా నవ్వారు.

'అది సరేగాని అమ్మ వసా నన్నది రాలేదేం!' అంది నవ్వాపుకుంటూ అత్తయ్య.

'అమ్మసంగతి మీకు తెలుసుగా, పిల్లలూ, ఇల్లూ అమెనెక్కడికీ కదలనియ్యవు. క్షణం తెరదాయె. ఈమారు వస్తానంది.' షర్టు హేంగర్‌కి తగిలిస్తూ అన్నాను.

"అందరూ బావున్నారా బావా!" అన్నాడు గోపీ.

"అందరూ బావున్నారు సుగుణ కూడా"

"పో బావా!" అంటూ వీధిలోకి వెళ్ళి పోయాడు గోపి.

"ఇదేమిటత్తయ్యా ఆడపిల్లలా" నవ్వుతూ అన్నాన్నేను

"కాబోయే పెళ్ళాం కదూమరి" అద్సరే మాటలు తర్వాత. ముందు స్నానంచెయ్యి బోంచేద్దువుగాని" అంది అత్తయ్య.

"మావయ్యేడి ?" అన్నాన్నేను.

"అదుగో వచ్చేస్తున్నారు చూడు.నూరేళ్ళా యుష్షు" అంది అత్తయ్య.

'ఏరా ఏధూ! ఇప్పుడేనా రావడం ?' అందరూ కులాసా ??" అన్నాడు మావయ్య.

'ఆఁ కులాసే ఉన్నాను'

"అవునూ రాధవచ్చిందటకదే! ఏదీ ?" అన్నాడు మావయ్య అత్తయ్యవైపు చూస్తు.

"అవును ఏదీ ? అంది నామనసు"

దాని బావ వచ్చాడు కదా. అందుకని గదిలోనుంచి రానంటోంది. అదికూడా ఇప్పుడే హడావుడిగా వచ్చింది.

'ఏరే నువు స్నానం చెయ్యి బాబూ' అన్నాడు మావయ్య, నేను పెరట్లోకి వెళ్ళిపోయాను.

* * *

"మరి పెళ్ళెప్పుడు పెట్టించమంటావ్" అంది వడ్డిస్తూ అత్తయ్య

"ఆ విషయం నువ్వడిగితే చెబుతాడు లే? రాధ అడగాలి గాని" అన్నాడు మామయ్య కళ్ళెగరేస్తూ

"దానికి వీళ్ళే చూసే నే సిగ్గాయె మరి' అంది అత్తయ్య మామిడి ముక్కలు పెడతూ

"రేపో, ఎల్లుండో పెళ్ళాం కాబోతూ ఇంకా సిగ్గేనా అమ్మాయ్ రాదా . ఇలారా" పిలిచాడు మామయ్య

నా ఒళ్ళంతా కళ్ళైపోయాయి.

రాధ సింపుల్‌గా తయారై గడపదగ్గిర కొచ్చి నిలబడింది.

క్షణంసేపు ఆశ్చర్యపోయాను నేను.

"నువ్వా?!" అన్నాను ఆశ్చర్యం నుండి తేరుకొంటూ.

"అవున్నేనే" తల దించుకొని నవ్వుతూ అంది రాధ

"అయితే రాధని ముందే చూశావన్న మాట" అంది నావైపు చూస్తూ అత్తయ్య

"చూడడమేమిటి కలిసి ప్రయాణం చేస్తేను" అన్నాన్నేను.

"ఏమిటసలు విషయం?" అన్నాడు రాధతో మామయ్య.

రాధ మధ్య మధ్యలో నవ్వుతూ అంతా వివరంగా చెప్పింది.

ఇంట్లో నవ్వులు వెల్లివిరిశాయి.

భోజనం ముగిసి పెరట్లో మంచంమీద కూర్చుని రాధ ఆల్బమ్ చూస్తున్నాను.

"నేను హేమ్మాలినీ కంటే బాగున్నానా బావా?" అంది రాధ వెనగ్గా వచ్చి.

గులాబీ రంగు మాచ్‌లో గులాబీలా మెరు స్తున్న రాధను తనివితీరా చూసి "మొత్తానికి అల్లరి పిల్లవే" అన్నాను.

"అల్లరి బావకి అల్లరి పిల్లయితేనే అందం." అంది రాధ తియ్యగా నవ్వుతూ.

ఆకాశంలో తటిల్లత మెరిసింది.

నా కౌగిట్లో రాధ నిలచింది.

జామచెట్టుమీది చిలుకల జంట మమ్మల్ని ఈర్ష్యగా చూస్తూ ఏదో చెప్పుకుంటు న్నాయి.

## నమ్మూ నమ్మకపో !

★ 1974 75 లో దేశంలో ఆహార ధాన్యం ఉత్పత్తి 101 మిలియన్ల టన్నులు మాత్రమే కాగా, 1975 -76లో 114 116మి. టన్నుల ధాన్యాలు ఉత్పత్తి అయ్యాయి.

★ ప్రస్తుతం వున్న అంచనాల ప్రకారం 11 మిలియన్ల టన్నుల బఫర్ నిల్వలు ఏర్పాటు చేయవచ్చును.

★ పారిశ్రామిక రంగంలో కూడా 1974 - 75 లో 2 5 శాతం మాత్రమే వున్న అభివృద్ధి రేటు 1975 76 లో 4 5 శాతానికి పెరిగింది.

★ 1974-75 లో నేల బొగ్గు ఉత్పత్తి 88 మిలియన్ల టన్నులు మాత్రమే కాగా, 1975 76 లో అది 98 మిలియన్ల టన్నులకు పెరిగింది

★ సిమెంటు ఉత్పత్తి కూడా 14 5 మిలియన్ టన్నుల నుంచి 17 మిలియన్ టన్నులకు పెరిగింది.

★ తయారైన ఉక్కు 5 5 మిలియన్ టన్నుల నుంచి 6 మిలియన్ల టన్నులకు పెరిగింది.

★ నత్రజని, ఫాస్ఫేటు ఎరువుల ఉత్పత్తి 1 5 మిలియన్ల టన్నుల నుంచి 1 8 మిలయన్ టన్నులకు పెరిగింది

'బావా ఎవరన్నా చూస్తారు' అంది రాధ బిడియపడుతూ.

"చూడనియ్! కాబోయే భార్యాభర్తలే కదా పోనీ పాపం, అనుకుంటారు" అన్నాను.

"అమ్మో! వాళ్ళు చూస్తున్నారు" అంది రాధ.

'ఎవరు?' అన్నాన్నేను అట్టూ ఇటూ చూస్తూ.

'చిలుకలు' అంది నా కౌగిట్లోంచి తప్పించుకొని జామచెట్టును చూపిస్తూ.

'యూసిల్లీ' అన్నాన్నేను.

వె...వ్వె...వ్వె . వెక్కిరిస్తూ ఇంట్లోకి పారిపోయింది సిగ్గుతో రాధ.

చిలుకలవైపు ఈర్ష్యగా చూస్తూ మంచం మీద కూలబడిపోయాను నేను.